సాక్షి మహబూబ్‌నగర్


ఆదివారం । 1 । డిసెంబర్ । 2024



కురుమూర్తి జాతర..

కురుమూర్తిస్వామి జాతర నెల రోజుల నుంచి వైభవంగా కొనసాగుతోంది.

వివరాలు 8లో ▸



మాయదారి రోగం..

జిల్లాలో హెచ్‌ఐవీ- ఎయిడ్స్ బాధితుల లెక్కలు పరిశీలిస్తే ఆందోళన కలుగుతోంది.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
33.5 /18.6

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉదయం, సాయంత్రం చల్లని గాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఎండ ఉంటుంది.

మాది ప్రజల ప్రభుత్వం..

మీరే మా బ్రాండ్ అంబాసిడర్లు..

- పెద్దలు అండగా నిలబడితే సీఎం అయ్యే అవకాశం వచ్చింది
- ఇది ఒక బాధ్యత.. ఈ అవకాశాన్ని జారవిడుచుకోను..
- పాలమూరును అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేస్తా..
- రైతు పండుగ ముగింపు సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- హాజరైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తదితర మంత్రులు



అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: 'పాలమూరు జిల్లాలో ఇంత పెద్ద ఎత్తున నిర్వహించిన రైతు పండుగ తెలంగాణలోని నాలుగు కోట్ల రైతాంగానికి గొప్ప సందేశం. మాది ప్రజల ప్రభుత్వం. మాకు ఏ బ్రాండ్ అంబాసీడర్లు అవసరం లేదు. మీరే మా బ్రాండ్ అంబాసీడర్లు' అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని అమిస్తాపూర్‌లో శనివారం జరిగిన రైతు పండుగ అవగాహన సదస్సు–ముగింపు సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా వ్యవసాయ, దాని అనుబంధ రంగాలకు సంబంధించిన ప్రదర్శనలు, స్టాళ్లను తిలకించిన అనంతరం బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. పాలమూరులో 20 లక్షల ఎకరాలకు నీళ్లు పారించే బాధ్యత నాదని.. రానున్న నాలుగు సంవత్సరాలు రైతు పండగలు చేస్తామన్నారు. రేవంత్ ఇంకా ఏమన్నారో ఆయన మాటల్లోనే..

నా ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కొడంగల్‌లో 1,300 ఎకరాల్లో పారిశ్రామికవాడ ఏర్పాటు చేయాలని అనుకున్నా. కానీ కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు అడ్డుకుంటున్నారు. లగచర్లలో మాయమాటలతో రెచ్చగొట్టి లంబాడీలను జైలుపాలు చేశారు. భూమి అనేది అమ్మ వంటిది. అలాంటి అనుబంధమే ఉంటుంది. పది రూపాయలు ఎక్కువ తీసుకోండి... పక్కకు వెళ్లి భూములు కొనుక్కోండి. అంతేగాని అభివృద్ధిని అడ్డుకోకండి. వాళ్లు అడ్డుకుంటారు.. వెళ్తారు.. వాళ్లకు ఫాంహౌస్‌లు ఉన్నాయి. వారి మాయమాటలు నమ్మకండి. బీఆర్‌ఎస్ వాళ్లు మల్లన్నసాగర్, కొండ పోచమ్మలో ముంచలేదా? రంగనాయక సాగర్‌లో దోచుకోలేదా? మల్లన్నసాగర్‌లో మల్లారెడ్డి అనే రైతు బతికున్నప్పుడు చితి పేర్చుకుని చనిపోయాడు. హరీశ్‌రావు.. వస్తావా.. ఆ కుటుంబాన్ని ఎంత ఆదుకున్నావో.. అక్కడికి పోదామా?



సభావేదికపై నుంచి మహిళలతో కరచాలనం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

పాలమూరును ఎండబెట్టిన 'బీఆర్‌ఎస్': భట్టి



గత ప్రభుత్వం కృష్ణానది ద్వారా ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాలకు నీళ్లు ఇవ్వకుండా ఎడారిగా మార్చిందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. 2004లో తాము అధికారంలో ఉన్నప్పుడే జూరాల, కోయిల్ సాగర్, భీమా, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులు మొదలు పెట్టామన్నారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జీఓ తామే ఇచ్చామని చెప్పారు. గడిచిన పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాలమూరు జిల్లాను ఎండబెట్టిందన్నారు. తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు కృతనిశ్చయంతో ఉందని స్పష్టం చేశారు.



ఓపెన్ టాప్ జీపులో సభావేదిక వద్దకు వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, తుమ్మల, జూపల్లి, టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్

ఏడాదిలో రైతులకు రూ.54 వేల కోట్లు ఖర్చు చేశాం

2023 నవంబర్ 30.. ఈ రోజుకు ఈ దేశ రాజకీయాల్లో గొప్ప ప్రాధాన్యత ఉంది. గతేడాది ఇదే రోజు 35 వేల పోలింగ్ బూత్‌లలో లక్షలాది మంది బారులుదీరి గడీల పాలనను పారదోలడానికి 92 లక్షల ఓట్లు కాంగ్రెస్ పార్టీకి వేసి గెలిపించారు. ఈ ఏడాది కాంగ్రెస్ పాలనలో రైతుల కోసం రూ.54 వేల కోట్లు ఖర్చు చేశాం. అందుకే ఈ ఉత్సవాన్ని ప్రపంచానికి తెలియజేయాలి. పాలమూరు గడ్డ మీద ఈ రైతు పండుగకు వేలాదిగా అన్నదాతలు తరలిరావడం సంతోషంగా ఉంది. రైతు పండుగను ఇక్కడే కాకుండా తెలంగాణలోని రైతుల వేదికల్లో లైవ్‌లో ప్రత్యక్షంగా చూస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన వ్యవసాయశాఖ అధికారులు, చీఫ్ సెక్రటరీ ఇతర అధికారులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా.



అమిస్తాపూర్‌లో రైతు పండుగ బహిరంగ సభకు హాజరైన జనం

సీఎం పర్యటన సాగిందిలా..

- 4.17 గంటలకు హైదరాబాద్ నుంచి భూత్పూర్ మండలం అమిస్తాపూర్ గ్రామ శివారులో ఏర్పాటు చేసిన రైతు పండుగ ప్రాంగణ ప్రాంతానికి ప్రత్యేక హెలీకాప్టర్‌లో రాక
- 4.25 గంటలకు ప్రత్యేక బస్సులో రైతు పండుగ ప్రాంగణానికి రాక.. వెనువెంటనే వ్యవసాయ, పౌర సరఫరాల శాఖ స్టాళ్ల పరిశీలన. ఆధునిక వ్యవసాయ సాంకేతిక పద్ధతులతో యాంత్రీకరణ పరికరాలు, వ్యవసాయ విధానాలు, పంట నిర్వహణ వంటి అంశాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు సీఎంకు వివరించారు.
- 4.52 గంటలకు మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి పోలీస్ ఓపెన్ టాప్ జీపులో సభావేదికపైకి చేరుకున్నారు.
- 4.55 గంటలకు రైతు పండుగ సభావేదికపై నుంచి ప్రజలకు సీఎం అభివాదం చేశారు. ఈ సందర్భంగా ఓ అభిమాని సీఎంకు ఫొటో బహూకరించారు. ఆ తర్వాత మంత్రులు, సీఎస్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు.
- 5.01 గంటలకు తెలంగాణ గీతాలాపన
- 5.35 గంటలకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కు సంబంధించిన రూ.143.53 కోట్లతో అభివృద్ధి పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.
- 5.55 గంటలకు ముఖ్యమంత్రి ప్రసంగం మొదలుపెట్టి.. 6.49 గంటలకు ముగించారు. ఆ తర్వాత సభాస్థలి నుంచి సీఎం హైదరాబాద్‌కు రోడ్డు మార్గంలో వెళ్లిపోయారు.

– మహబూబ్‌నగర్ రూరల్



అధునాతన వ్యవసాయ డ్రోన్ పరికరాలను పరిశీలిస్తున్నసీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు

సీఎం మాటల్లోని కొన్ని ముఖ్యాంశాలు..

- పంట రుణాల మాఫీకి సంబంధించి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొలి ఏడాది చేయకపోవడంతో మిత్తిలు పెరిగాయి. అప్పటి ప్రభుత్వం చేసిన రుణమాఫీ రైతులు కట్టాల్సి మిత్తిలకే సరిపోయింది. దీంతో పెద్దలు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను సలహా అడిగా. ఆయన చెప్పిన మేరకు రైతులకు ప్రయోజనం చేకూరేలా తొలి ఏడాదిలోనే రుణమాఫీ చేశాం.
- నేను కేంద్రమంత్రిగా, రాష్ట్ర మంత్రిగా పనిచేయలేదు. జెడ్పీటీసీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీగా అధికారంలోకి ఉండి కుర్చీలో కూర్చోలేదు. మీరందరూ సీఎంగా నన్ను కూర్చోబెట్టి ఏడాది అవుతోంది. ఈ వేదికపై పెద్దలు వచ్చి మనకు అండగా నిలబడ్డారు.
- వరి వేస్తే ఉరే అని ఆనాడు కేసీఆర్ అన్నారు. ఈ రోజు వరి వేస్తే రూ.500 బోనస్ ఇస్తామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఇప్పుడు ధాన్యం అమ్మిన మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో బోనస్ జమవుతోంది.
- మన ప్రాంత అల్లుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాష్ట్ర నీటి పారుదలశాఖ మంత్రిగా ఉన్నారు. మన బిడ్డను ఆయనకు ఇచ్చి పెళ్లి చేశాం. ఆయన పాలమూరు రుణం తీర్చుకోవాలి. ఏడాదికి రూ.20 వేల కోట్లు ఇచ్చేలా సహకరిస్తారు.
- మల్లు అనంతరాములుకు ఈ ప్రాంతంతో ఎనలేని బంధం ఉంది. నాగర్‌కర్నూల్ ఎంపీగా ప్రజలకు సేవలందించారు. అదేవిధంగా ప్రస్తుత నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి ఉన్నారు. కాబట్టి ఈ ప్రాంతంతో అనుబంధం కలిగి ఉన్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఈ ప్రాంత అభివృద్ధికి చేయూతనందించరా.. ఏమిటి ?
- మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ అంటే నాకు ఇష్టం. అందుకే ఆయనను జిల్లా ఇన్‌చార్జిగా పెట్టినా. ఆయన మేధావి.. ఇంగ్లిష్ బాగా వచ్చు. అయినా నామీద ఇష్టంతో నేను ఎక్కడ సంతకం పెట్టమన్నా పెడతారు.



మహిళా సంఘాల సభ్యులకు చెక్కు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు

రైతు రాజ్యమే కాంగ్రెస్ ధ్యేయం

రూ.143.53 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

– వివరాలు 8లో..

పెద్దలు అండగా నిలబడ్డారు..

మీ పాలమూరు బిడ్డకు ఈ గడ్డ అంతా అండగా నిలబడి ఆశీర్వదించింది. సీఎం అయ్యే అవకాశం వచ్చింది. పాలమూరు జిల్లా నల్లమలలోని కొండారెడ్డిపల్లి నుంచి రైతు బిడ్డగా బయలుదేరా. ఈ జిల్లా కష్టాలు, కన్నీళ్లను.. కృష్ణమ్మ జలాలను, వలసలు పోతున్న పాలమూరు బిడ్డలనూ చూశాను. అచ్చంపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్ నుంచి గుంపుమేస్త్రీలు తట్ట, పార పని కోసం ముంబై తీసుకుపోతుంటే చూశాను. నేను వనపర్తిలో చదువుకుండేవాణ్ణి. ఏ రోజైనా మాకు రాకపోతదా అనుకునేవాడిని. ఈ అవకాశ నాకు వస్తుందనుకులేదు. ఆనాడు మన జిల్లా బిడ్డ బూర్గుల రామకృష్ణరావు సీఎం అయితే.. సరిగ్గా 70 ఏళ్ల తర్వాత కొండారెపల్లి నుంచి బయలుదేరిన ఒక రైతుకు తెలంగాణ రాష్ట్రానికి నాయకత్వం వహించే అవకాశం వచ్చింది, నా జన్మధన్యమైంది. ఈ అవకాశం ఆషామాషీగా వచ్చింది కాదు. ఈ అవకాశాన్ని అనవసరమైన ఆర్భాటాలు, వేషాలు వేయడానికి కాదు. ఇది ఒక బాధ్యత. ఎంతో అనుభవజ్ఞులైన మంత్రులు, కేశవరావు వంటి వారు ఈ వేదికపై ఉన్నారు. వారందరూ పెద్ద మనసు చేసుకుని వయసులో చిన్నవాడనైనా నాకు సీఎంగా అవకాశం ఇచ్చారు. మీ ఆశీర్వాదంతో పాలమూరు జిల్లాకు అవకాశం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్రానికి పెద్ద బాధ్యత అయిన సీఎం పదవిని ఇచ్చింద్రు. మనందరం వారికి ధన్యవాదాలు తెలుపుకుందాం. కాగా, సీఎం ప్రసంగానికి ముందు తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం ఆలపించారు.

న్యూస్‌రీల్

బ్యాంకు కేసులు రాజీ అయ్యే విధంగా చూడాలి



పాలమూరు: ఈ నెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో బ్యాంకు కేసులు అధికంగా పరిష్కారమయ్యే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర అన్నారు. జిల్లా కోర్టులో శనివారం బ్యాంకు అధికారులు, మేనేజర్లతో లోక్ అదాలత్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. పలు రకాల బ్యాంకులలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులు గుర్తించి వాటన్నింటినీ పరిష్కారం అయ్యే విధంగా చూడాలన్నారు. అధిక మొత్తంలో కక్షిదారులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ భాస్కర్, ఇతర బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

14న సమూహ రాష్ట్ర మహాసభలు

పాలమూరు: జిల్లాకేంద్రంలో ఈ నెల 14న నిర్వహించే సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సమూహ రాష్ట్ర నేతలు కాత్యాయని విద్మహే, మెట్టు రవీందర్, సుంకిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. జిల్లాకేంద్రంలోని సీనియర్ సిటిజన్ ఫోరం కార్యాలయంలో శనివారం సమూహ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఆదర్శవంతమైన లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యస్థాపన కోసం అన్ని మతాలు కలిసి జీవించడానికి అనువైన వాతావరణం కల్పించిందని తెలిపారు. లౌకిక సామ్యవాద భావనలను భారత రాజ్యాంగంలో నుంచి తీసివేయాలనే కుట్రలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. కార్యక్రమంలో రాఘవాచారి, జగపతిరావు, లక్ష్మణ్‌గౌడ్, ఖలీల్, వామన్‌కుమార్, ఉదయ్, సుభాష్, సతీష్, సృజన, ఖలీల్, అజీజ్, శ్రీశైలం పాల్గొన్నారు.

ధర్మమార్గంలో నడవాలి

- ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు
- పాలమూరులో ఆకట్టుకున్న ధార్మిక ప్రవచనం



స్టేషన్ మహబూబ్‌నగర్: హైందవ సంప్రదాయంలో కార్తీక మాసానికి విశిష్ట ప్రాధాన్యత ఉందని పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు అన్నారు. విశ్వహిందూ పరిషత్ పాలమూరు ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని అన్నపూర్ణగార్డెన్స్‌లో శనివారం గరికపాటి నరసింహారావు ధార్మిక ప్రవచనం ఎంతో ఆకట్టుకుంది. హైందవ సంస్కృతి, సంప్రదాయాలు, కార్తీక మాసం విశిష్టతపై ప్రవచనం చేశారు. కార్తీక మాసంలో హిందువులు కుటుంబసమేతంగా ఒక రోజు వనంలోకి వెళ్లి సామూహిక భోజనం చేయడం వల్ల ఆప్యాయతలు పెరుగుతాయని అన్నారు. ప్రతి హిందువు ధర్మానికి కట్టుబడి, ధర్మమార్గంలో నడవాలని కోరారు. అనంతరం గరికపాటిని వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు మద్ది యాదిరెడ్డి, కార్యదర్శి నలిగేశి లక్ష్మీనారాయణ, వసంతం వెంకటేష్, చంద్రయ్య, విఘ్నేష్, హన్మంతు, సురేష్, బట్టు శ్రీను, రాంచందర్, సంపత్, రామకృష్ణ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జోగుళాంబ సన్నిధిలో సినీనటుడు రాజేంద్రప్రసాద్



అలంపూర్: ఐదో శక్తిపీఠ క్షేత్రంలో కొలువైన జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి వారిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని సినీనటుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. అష్టాదశ శక్తిపీఠాల్లో ఐదో శక్తిపీఠమైన అలంపూర్ ఆలయాలను ఆయన కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. ఆలయ ఈఓ పురేందర్ కుమార్ అర్చక స్వాములతో కలిసి ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి వారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం పలికారు. ఆలయ ఈఓ ఆయన్ను శేషవస్త్రాలతో సత్కరించారు. మాజీ మంత్రి, నర్సాపురం ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డికు జోగుళాంబ ఆలయాలను దర్శించుకున్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులో అక్రమాలు



మహబూబ్‌నగర్ అర్బన్ మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల బాధితులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ/జెడ్పీసెంటర్: జిల్లాకేంద్రంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులో అక్రమాలు చోటు చేసుకున్నాయని, బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం ఖలీల్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో సంఘం కార్యాలయంలో బాధితులతో విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 ఏళ్లుగా పేదలు పోరాడి సాధించుకున్న ఇంటి పట్టా సర్టిఫికెట్లను 2018లో అప్పటి ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని స్వాధీనం చేసుకుందన్నారు. అనంతరం 886 మందిని అర్హులుగా గుర్తించినా ఇవ్వకుండా వంచనకు గురిచేసిందని ఆరోపించారు. దివిటిపల్లిలోని 1,024 ఇళ్లను ఆనాటి పాలకులు తమకు ఇష్టం వచ్చిన వారికి కట్టబెట్టారని ఆరోపించారు. అనర్హులకు ఇళ్లు ఇచ్చిన రెవెన్యూ అధికారులపైనా విచారణ జరిపించాలన్నారు. ఈ విషయమై ఎన్నో ఏళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ బాధితులు తిరుగుతున్నా ప్రయోజనం దక్కడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా విచారణ పేరిట కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. అనంతరం అర్బన్ మండల తహసీల్దార్ కార్యాలయానికి బాధితులతో కలిసి వెళితే గదులన్నింటికీ తాళాలు వేసి ఉంచడం చూసి ఆందోళనకు గురయ్యారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సంబంధిత అధికారులపై చర్య తీసుకోవాలని కొద్దిసేపు కార్యాలయం ఎదుట వారు నిరసన తెలిపారు. కార్యక్రమంలో టీఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బి.విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పి.యాదగిరి, పట్టణ కార్యదర్శి ఎం.డి.జలాల్ పాషా, చైతన్య మహిళా సంఘం నాయకురాలు శ్రీదేవి, ఆయా సంఘాల నాయకులు జి.గట్టన్న, బాలకృష్ణ, కె.జైపాల్, డబుల్ బెడ్‌రూం ఇళ్ల బాధితులు మమత, లక్ష్మి, ఆయేషాబేగం, ఆరిఫాబేగం తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన ధాన్యం

జడ్చర్ల/నవాబుపేట/దేవరకద్ర: జిల్లాలోని ప్రధాన వ్యవసాయ మార్కెట్‌యార్డులకు శనివారం భారీగా ధాన్యం పోటెత్తింది. అందులో నవాబ్‌పేట మార్కెట్‌కు 12,199 బస్తాల వరి ధాన్యం, 876 బస్తాల మొక్కజొన్న వచ్చింది. ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యం క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,785, కనిష్టంగా రూ.2,089 పలికింది. మొక్కజొన్న క్వింటాల్‌కు రూ.2,414 ధర వచ్చింది.

- బాదేపల్లి మార్కెట్‌కు 9,620 క్వింటాళ్ల ధాన్యం, 603 క్వింటాళ్ల మొక్కజొన్న విక్రయానికి వచ్చింది. మొక్కజొన్న క్వింటాల్ గరిష్టంగా రూ.2,421, కనిష్టంగా రూ.2,291 ధరలు లభించాయి. ధాన్యం హంసరకం గరిష్టంగా రూ.2,229, కనిష్టంగా రూ.1,736, ఆర్‌ఎన్‌ఆర్ రకం గరిష్టంగా రూ.2,750, కనిష్టంగా రూ.1,866, శ్రీరాంగోల్డ్ గరిష్టంగా రూ.2,526, కనిష్టంగా రూ.2,075, ఆముదాలు రూ.5,650, పత్తి గరిష్టంగా రూ.6,801, కనిష్టంగా రూ.6,189 ధరలు పలికాయి.
- దేవరకద్ర ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యం క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,670, కనిష్టంగా రూ.2,009 పలికింది. మార్కెట్‌కు వేయి బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.



నిఘా నీడలో సీఎం సభ

- భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించిన అదనపు డీజీపీ మహేష్ భగవత్



ఏర్పాట్లు పరిశీలిస్తున్న అదనపు డీజీపీ మహేష్ భగవత్

మహబూబ్‌నగర్ క్రైం: అమిస్తాపూర్ సమీపంలో శనివారం జరిగిన సీఎం రేవంత్‌రెడ్డి సభకు సంబంధించిన పోలీస్ భద్రత, బందోబస్తును లా అండ్ ఆర్డర్ అదనపు డీజీపీ మహేష్ భగవత్, మల్టీజోన్–2 ఐజీ సత్యనారాయణ, ఎస్పీ డి.జానకి పర్యవేక్షించారు. ప్రధానంగా అదనపు డీజీపీ పోలీస్ ఉన్నత అధికారులతో భద్రత వ్యవహారంపై ముందస్తుగా చర్చించారు. ఆ తర్వాత సీఎం పర్యటించే స్టాల్స్, ఇతర ప్రాంతాల్లో ఎలాంటి బందోబస్తు కల్పించాలి అనే అంశంపై సూచనలు అందించారు. ఉదయం నుంచి ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తూ పోలీస్ అధికారులు, సిబ్బందికి సూచనలు అందిస్తూ భద్రతపరంగా ఎలాంటి లోపాలు జరగకుండా చూశారు. దాదాపు రెండు వేల మందితో మూడు అంచెల పోలీస్ భద్రతను సీఎంకు కల్పించారు. సభకు వచ్చే వారికి ప్రత్యేక ప్రవేశ ద్వారాలు ఏర్పాటు చేశారు. బాంబు స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్‌లతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. అమిస్తాపూర్‌కు సీఎం చేరుకున్న తర్వాత ఆ మార్గంలో ఇతర వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ట్రాఫిక్‌ను పూర్తిగా జడ్చర్ల మీదుగా మళ్లించారు. దీంతో వన్‌టౌన్, క్రిస్టియన్‌పల్లి, పిస్తా హౌజ్ దగ్గర ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

కాన్వాయ్‌ను అడ్డుకునే యత్నం

జడ్చర్ల: జిల్లాపర్యటన ముగించుకొని రోడ్డుమార్గంలో హైదరాబాద్ వెళుతున్న సీఎం రేవంత్‌రెడ్డి కాన్వాయ్‌ను అడ్డుకునేందుకు ప్రయత్నించిన బీజేవైఎం నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. కావేరమ్మపేట శివారులో 44వ నంబర్ హైవేపైకి వచ్చే ప్రయత్నం చేయగా.. రోడ్డుపైకి రాకముందే ఎస్‌ఐ చంద్రమోహన్ సిబ్బందితో సహా వెళ్లి బీజేవైఎం నాయకులను అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

- అమిస్తాపూర్ సభాప్రాంగణం వద్ద భారీగా జనం, వాహనాలు రావడంతో రెండు అంబులెన్స్‌లు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయాయి.

రైతు రాజ్యమే కాంగ్రెస్ ధ్యేయం



సభావేదికపై సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కేశవరావు, వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, ఎమ్మెల్యేలు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రాష్ట్రంలో రైతు రాజ్యమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని మంత్రులు, ఎంపీ, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు అభిప్రాయపడ్డారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం అమిస్తాపూర్‌లో నిర్వహించిన రైతుపండుగ బహిరంగ సభలో వారు పాల్గొని మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడతామని చెప్పారు.

రైతులు సంతోషంగా ఉండాలనే



ప్రతి రైతు సంతోషంగా ఉండాలనే రైతుపండుగను ప్రభుత్వం నిర్వహిస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఏక కాలంలో రూ.18 వేల కోట్ల పంట రుణమాఫీ చేసిన ఘనత రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని.. రైతు రుణమాఫీ చేయలేదని ప్రతిపక్ష పార్టీలు రైతులను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేవలం రూ.11 వేల కోట్ల పంట రుణమాఫీ మాత్రమే చేశారని వివరించారు. బోనస్‌తో రైతులతో పాటు కౌలు రైతులకు లాభం చేకూరుతుందని తెలిపారు.

వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలోనే..



వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఉమ్మడి జిల్లాలోని 8 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్, నెట్టంపాడు ప్రాజెక్టులు మంజూరు చేశారని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆ ప్రాజెక్టులు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయని.. పాలమూర్–రంగారెడ్డి ఎత్తిపోతల పనులు పూర్తిచేసి రైతుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రం రక్షింపబడాలంటే మరో దీక్ష చేయాలని కేటీఆర్ అంటున్నారని.. రూ.8 లక్షల కోట్ల అప్పులు చేస్తే నెలకు రూ.6 వేల కోట్ల వడ్డీ చెల్లించే పరిస్థితి తీసుకొచ్చారని మండిపడ్డారు. గత ప్రభుత్వం చివరి దశలో రింగురోడ్డు అమ్మి రైతుబంధు డబ్బులిచ్చారని ఆరోపించారు.

పంట రుణమాఫీ ఘనత మాదే..



దేశ చరిత్రలో కనీవిని ఎరుగని రీతిలో పెద్దఎత్తున పంట రుణమాఫీ చేసిన ఘనత తమపార్టీకే దక్కుతుందని.. సంపూర్ణ రుణమాఫీ చేసే సత్తా తమకే ఉందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రైతులు సుభిక్షంగా ఉండాలనే రైతుపండుగ నిర్వహిస్తున్నామని.. ఈ వాతావరణం చూస్తుంటే ఏడాదిలోనే రైతుపండుగ వచ్చినట్లు ఉందని తెలిపారు. వ్యవసాయాన్ని పండుగ చేసిన ఘనత వైఎస్‌దేనని.. అప్పటి నుంచి రైతుకు అండగా ఉన్న ప్రభుత్వం కాంగ్రెస్ అన్నారు.

హామీలన్నీ అమలు చేస్తున్నాం..



రాష్ట్రంలో విధ్వంసమైన ఆర్థిక పరిస్థితి, చిన్నాభిన్నమైన పాలన వ్యవస్థను సరి చేసుకుంటూ అప్పుల పాలైన రాష్ట్రాన్ని సక్రమ మార్గంలో నిలుపుకొంటూనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. భారమైనా కడుపు కట్టుకొని రైతులకు రూ.2 లక్షల పంట రుణమాఫీ చేస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం ఇస్తానని ఎగ్గొట్టిన రైతుబంధు డబ్బులను తాము అధికారంలోకి వచ్చిన వెంటనే చెల్లించినట్లు వివరించారు. రైతులు పండించిన అన్ని పంటలను కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. వచ్చే నాలుగేళ్లలో అన్ని జిల్లాల్లో ఆయిల్‌పాం సాగును పెంచి రైతుల కళ్లల్లో ఆనందాన్ని చూసే దాకా కాంగ్రెస్ ప్రభుత్వం వెనుకడుగు వేయదన్నారు.

రైతుల శ్రేయస్సే లక్ష్యం ..



రైతుల శ్రేయస్సు కోసమే కాంగ్రెస్‌పార్టీ పని చేస్తుందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. రైతుల ఇబ్బందులు గుర్తించి రాహుల్‌గాంధీ రైతు డిక్లరేషన్ ప్రకటించారని.. దాని ప్రకారమే పంట రుణమాఫీ చేసినట్లు వివరించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో 50 వేల ఉద్యోగాలిస్తే .. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలల్లో 50 వేల ఉద్యోగాలు ఇచ్చిందని తెలిపారు.

బోనస్‌తో అదనపు ఆదాయం..



కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం వరి ధాన్యం విక్రయించిన రైతులకు ప్రభుత్వం అందించే బోనస్‌తో అదనపు ఆదాయం సమకూరుతుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి తెలిపారు. వలసకు మారుపేరు అయిన పాలమూర్ జిల్లాలో ప్రభుత్వం నిర్వహించిన రైతుపండుగకు వేదిక కావడం సంతోషకరమన్నారు. కురుమూర్తిస్వామి దీవెనలతో ప్రతి రైతు కుంటుంబంలో ఈ పండుగ జరగాలని ఆకాంక్షించారు.

రైతులను విస్మరించిన బీఆర్ఎస్..

గత ప్రభుత్వం రైతులను పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏక కాలంలో రూ.రెండు లక్షల పంట రుణమాఫీ చేసిందని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి అన్నారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం కొనసాగుతుందని తెలిపారు.

■ అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ.. దేశచరిత్రలో ఏకకాలంలో రూ.రెండు లక్షల పంట రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని.. రైతు సదస్సులో రైతులను చూస్తే అర్థమవుతుందన్నారు.

■ జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రైతులను ఎప్పుడూ శత్రువులుగానే చూశాయన్నారు. జడ్చర్లలో 31,544 రైతులకు రూ.259.87 కోట్ల పంట రుణమాఫీ జరిగిందని తెలిపారు. బీజేపీ సర్కార్ అంబానీ, అదానీకి రూ.10 లక్షల కోట్లు రుణమాఫీ చేసిందని ఆరోపించారు. ఇచ్చిన మాట తప్పని ప్రభుత్వం తమదని చెప్పారు.

■ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. 22 లక్షల మంది రైతులకు రూ.18 వేల కోట్ల పంట రుణమాఫీ చేసినట్లు తెలిపారు. ఒక్క సంవత్సరంలో రైతుల కోసం ఇంత పెద్ద మొత్తం ఖర్చుచేసిన ప్రభుత్వం మరొకటి లేదన్నారు.

■ వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం విక్రయించిన రైతులకు డబ్బులతో పాటు బోనస్ వారి ఖాతాల్లో జమయ్యాయని తెలిపారు. జిల్లా ప్రజలకు ఏం చేయాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలుసన్నారు.

■ నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్క రైతు బాగుపడాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నా ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు.

■ మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. రైతుపండుగ నభూతో.. నభవిష్యత్ అన్నట్లు సాగుతుందన్నారు. శాస్త్రజ్ఞుల సూచనలతో రైతులకు మేలు చేకూరుతుందని వివరించారు.

■ దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాక్షస పాలన అంతమొంది ప్రజాపాలన వచ్చిందని, ఇచ్చిన హామీలు అమలు చేస్తామని తెలిపారు. ఇంత పెద్ద సంఖ్యలో రైతులు వస్తారని అనుకోలేదని.. ఉమ్మడి జిల్లా రైతులు స్వచ్ఛందంగా రైతుపండుగకు వచ్చారని వివరించారు.

రూ.143.53 కోట్ల పనులకు శంకుస్థాపన



సీఎం రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన వివిధ అభివృద్ధి పనుల శిలా ఫలకాలు

దేవరకద్ర: మహబూబ్‌నగర్ జిల్లా అమిస్తాపూర్‌లో శనివారం నిర్వహించిన రైతు పండుగ సదస్సుకు హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి ముందుగా రూ.143.53 కోట్లతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

■ జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ భవన్ సమీపంలో నిర్మించే ఉర్దూ ఘర్, నూతనంగా నిర్మించే షాదీఖానా భవనం, మౌలాలి గుట్ట ప్రాంతంలో ప్రహరీ, ఇతర సౌకర్యాల కోసం రూ.45 కోట్లతో చేపట్టే మూడు పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు.

■ మహబూబ్‌నగర్ జిల్లాలోని పీఆర్అండ్ఆర్‌డీ శాఖ పరిధిలో రూ.49.9 కోట్లతో నిర్మించే 25 బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

■ ట్రైబల్ వెల్ఫేర్ శాఖ పరిధిలో రూ.10.68 కోట్లతో తండాలకు నిర్మించే బీటీ రోడ్ల పనులకు సీఎం శంకుస్థాపన చేశారు.

■ ఆర్అండ్‌బీ శాఖ పరిధిలో రూ.25 కోట్లతో మిడ్జిల్ నుంచి కొత్తపల్లి వయా కొత్తూర్ డబుల్ రోడ్డు పనులకు సీఎం శంకుస్థాపన చేశారు.

■ పోతులమడుగులో రూ.2.65 కోట్లతో నిర్మించే మినీ స్టేడియం పనులకు శంకుస్థాపన చేశారు.

■ జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు కేజీబీవీ జూనియర్ కళాశాలలో రూ.3.25 కోట్లతో నిర్మించే తరగతి గదులు, ల్యాబోరేటరీ, టాయిలెట్స్ పనులకు శంకుస్థాపన చేశారు.

■ అలంపూర్ కేజీబీవీలో రూ.2.30 కోట్లతో నిర్మించే పనులకు శంకుస్థాపన చేశారు.

■ నందిన్నెలో రూ.2.70 కోట్లతో నిర్మించే కేజీబీవీ భవనానికి శంకుస్థాపన చేశారు.

■ గట్టు కేజీబీవీలో జూనియర్ కళాశాల అప్‌గ్రేడ్ కోసం రూ.2.05 కోట్లతో నిర్మించే భవనానికి శంకుస్థాపన చేశారు.

■ గద్వాలలో ప్రభుత్వ మెడికల్ కళాశాల, సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు.

అట్టహాసంగా రగ్బీ పోటీలు ప్రారంభం



పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన వివిధ జిల్లాల క్రీడాకారులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14 బాల, బాలికల రగ్బీ పోటీలు శనివారం రాత్రి అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభోత్సవ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ అర్బన్ విద్యాశాఖాధికారి లక్ష్మణ్ సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా క్రీడా పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం క్రీడాకారులనుద్దేశించి మాట్లాడారు క్రీడాకారులు ప్రతిభచాటి జాతీయ, అంతర్జాతీయస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఓడినవారు నిరాశ చెందకుండా మళ్లీ గెలుపు కోసం తీవ్రంగా శ్రమించాలని కోరారు. క్రీడల్లో వచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

టోర్నీని విజయవంతంగా నిర్వహిస్తాం

రాష్ట్రస్థాయి రగ్బీ టోర్నీని విజయవంతంగా నిర్వహిస్తామని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి అన్నారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. టోర్నీలో క్రీడాకారులు ప్రతిభను చాటాలని కోరారు. రాష్ట్రస్థాయి రగ్బీ టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రటరీ సి.నిరంజన్‌రావు, టోర్నమెంట్ రాష్ట్ర పరిశీలకులు ఎం.కిష్టయ్య, యూనుస్ బాష, టెక్నికల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, పెటా టీఎస్ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌గౌడ్, జిల్లా యోగా సంఘం కార్యదర్శి ఆర్.బాల్‌రాజు, రగ్బీ సంఘం కోశాధికారి బాల్‌రాజు, పీడీలు వేణుగోపాల్, పరశురాం, వడెన్న, సాదత్‌ఖాన్, ఆయా జిల్లాల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



టోర్నీని ప్రారంభిస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్

240 మంది క్రీడాకారులు..

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14 రగ్బీ పోటీల్లో రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాలైన మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, మెదక్, ఖమ్మం, ఆదిలాబాద్, హైదరాబాద్ ఉమ్మడి జిల్లాల నుంచి బాల, బాలికలు జట్లు పాల్గొన్నాయి. దాదాపు 240 మంది క్రీడాకారులు, 60 మంది అఫీషియల్స్ పాల్గొన్నారు. జట్లకు మూడు గ్రూపులుగా విభజించి మెయిన్ స్టేడియంలో రెండు కోర్టుల్లో లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. నేటి (ఆదివారం) ఉదయం 7.30 గంటల నుంచి మ్యాచ్‌లు జరగనున్నాయి.

రాష్ట్రస్థాయి టోర్నీలో విజేతగా నిలవాలి

- జిల్లా కబడ్డీ సంఘం కార్యదర్శి కురుమూర్తిగౌడ్
- మహిళా జట్టుకు కోచింగ్ క్యాంప్ ప్రారంభం



క్రీడాకారిణులను పరిచయం చేసుకుంటున్న జిల్లా కబడ్డీ సంఘం సభ్యులు

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీలో జిల్లా జట్టు మెరుగైన ప్రతిభ కనబరిచి విజేతగా నిలవాలని జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో జిల్లా మహిళా కబడ్డీ జట్టుకు కోచింగ్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో వచ్చేనెల 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా కబడ్డీ టోర్నమెంట్ ఉంటుందని తెలిపారు. వారం రోజులపాటు మహిళా జట్టుకు కోచింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా కబడ్డీ సంఘం ఉపాధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శులు బాల్‌రాజు, పాపారాయుడు, సభ్యులు లతీఫ్, మేరిపుష్ప, శివాని, రజిని, యూ.శ్రీనివాసులు, గణేష్ పాల్గొన్నారు.

వైభవంగా కురుమూర్తి జాతర



కురుమూర్తిస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



క్యూలైన్లో బారులుదీరిన భక్తులు

చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురంలో వెలసిన కురుమూర్తిస్వామి జాతర నెల రోజుల నుంచి వైభవంగా కొనసాగుతోంది. ఉత్సవాలకు శనివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా అర్చకులు ఆలయాన్ని శుద్ధిచేసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు ఉదయం నుంచే క్యూలైన్లో నిల్చొని స్వామివారిని దర్శించుకున్నారు. కొందరు భక్తులు కోనేరులో స్నానాలు ఆచరించి తడిగుడ్డలతో మెట్లపై దీపాలు వెలిగించి.. కొబ్బరికాయలు కొట్టి మొక్కుకున్నారు. దాసంగాలు పెట్టి గండదీపాలు మోశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. దీంతోపాటు అలివేలు మంగమ్మ, ఆంజనేయస్వామి, చెన్నకేశవస్వామి, ఉద్దాల మండపం, జాతర మైదానంలోని రాజగోపురం, సత్రాలు, కోనేరు భక్తులతో కిటకిటలాడాయి.

- జిల్లాలో 2,953 మంది బాధితులు
- 18 నుంచి 45 ఏళ్లలోపు వారే బాధితులు
- నేడు అంతర్జాతీయ ఎయిడ్స్ నివారణ దినోత్సవం

మాయదారి రోగం.. భవిత ఆగం!

పరీక్షలతోనే సరి.. అవగాహన ఏది మరి?



పాలమూరు: జిల్లాలో ప్రస్తుతం ఉన్న హెచ్ఐవీ–ఎయిడ్స్ బాధితుల లెక్కలు పరిశీలిస్తే కొంత ఆందోళన కల్గిస్తున్నాయి. ఇటీవల హెచ్ఐవీ పాజిటివ్ కేసుల పెరుగుదల నమోదు తీరు భవిష్యత్‌ను ప్రమాదకరంగా సూచిస్తోంది. జాతీయ రహదారులు, పరిశ్రమలు, దాబాలు అత్యధికంగా ఉన్న ఏరియాలతో పాటు వివాహేతర సంబంధాలు, లైంగిక కార్యకలాపాలు దీనికి కారణాలవుతున్నాయి. జిల్లా నుంచి వందల సంఖ్యలో పెద్దపెద్ద నగరాలకు వలసలు వెళ్లడం, అక్కడ ఇతర ప్రాంతాలకు చెందిన వారితో కలవడం ఒకటి అయితే, జిల్లా పొడవునా జాతీయ రహదారి ఉండటం కూడా హెచ్ఐవీ–ఎయిడ్స్ బాధితుల పెరుగుదలకు కారణాలుగా నిలుస్తున్నాయి. కొందరు తెలిసి తెలియక చేసిన తప్పు వల్ల అందమైన జీవితంతో పాటు భార్య పిల్లల జీవితాలు సైతం అంధకారంలోకి నెట్టుతున్నారు.

క్షణకాలం సౌఖ్యం.. కోరి కష్టాల్ని తెస్తోంది. అవగాహనలేమీ, భవితను ఆగం చేస్తోంది. కొత్త కలకలం సృష్టిస్తోంది. ప్రజలపై ఎయిడ్స్(హెచ్ఐవీ) పంజా విసురుతోంది. యంత్రాంగం ఉదాసీనత ఆసరాగా హెచ్ఐవీ కేసులు కలవరపరుస్తున్నాయి. పడకేస్తున్న ప్రచారాలు, కొరవడిన కౌన్సెలింగ్‌లు యువతను వక్రమార్గం వైపు నెట్టుతున్నాయి. అమాయక గ్రామీణ ప్రజలతోపాటు, పట్టణల్లోనూ మహమ్మారి బారిన పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని కేసుల తీరు, దుష్పరిణామాలకు దారి తీస్తున్న వైనం, బయటికి చెప్పుకోలేని పరిస్థితి, పక్కవాళ్లకు తెలిస్తే ఎక్కడ అవమానపరుస్తారోననే భయం, ఎప్పటికీ బాగు కానీ రోగం, బతికినంత కాలం మందులు తింటూ జీవించాల్సిన దుర్భర పరిస్థితి. నిత్యం పరీక్షలు, చికిత్సలు చేయించుకుంటూ సమాజంలో బతుకుతున్నారు. ఇలాంటి వాళ్లను చూసి జాలి చూపించకపోయిన హేళ చేయకుండా ఉంటే బాగుంటుంది. ఆదివారం అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం!

■ జిల్లాలో ఈ ఏడాది 24888 మందికి హెచ్ఐవీ–ఎయిడ్స్ పరీక్షలు చేయగా, దీంట్లో 439మందికి పాజిటివ్ వచ్చింది. 18668 మంది గర్భిణీలకు పరీక్షలు చేయగా 13మందికి పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. జిల్లాలో మొత్తం 2953మంది బాధితులు మందులు వాడుతుండగా, కొత్తగా 452పాజిటివ్ కేసులు వచ్చాయి. ఇక జిల్లాలో పురుషులు 1246ఉండగా, మహిళలు1574, చిన్న పిల్లల్లో ఆడ పిల్లలు 62, మగ పిల్లలు 72మంది ఉన్నారు. జిల్లాలో అత్యధికంగా మహబూబ్‌నగర్ రూరల్, అర్బన్ ఏరియాలో కలిపి 655మంది బాధితులుంటే దీంట్లో 351 మహిళలు, 278పురుషులు, 26మంది చిన్నారులు ఉన్నారు. హన్వాడలో 249, భూత్పూర్ 199 మంది బాధితులు ఉన్నారు. నారాయణపేట జిల్లాలో ఈ ఏడాది 8595మంది గర్భిణులకు పరీక్షలు చేయగా, ఆరుగురికి పాజిటివ్ వచ్చింది. ఇక 9808 జనరల్ పరీక్షలు చేయగా, 74మందికి పాజిటివ్ వచ్చింది. ఈ జిల్లాలో మందులు వాడుతున్న వారు 1749మంది ఉన్నారు. అధికంగా నారాయణపేటలో 279, కోస్గిలో 246, ధన్వాడలో 164మంది బాధితులు ఉన్నారు.



ఐసీటీసీ సెంటర్

సోషల్ మీడియా ప్రభావంతో..

జిల్లాలో పరీక్షల సంఖ్య గణనీయంగా పెంచడం వల్ల కేసులు పెరుగుదల ఉంది. అవగాహన సదస్సులు అధికంగా నిర్వహిస్తున్నారు. ఎన్జీఓలు సైతం స్వచ్ఛందంగా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సోషల్ మీడియా ప్రభావం కారణంగా శారీరక సంబంధాలు పెరిగిపోవడం వల్ల పాజిటివ్ శాతం పెరుగుతుంది. హెచ్ఐవీ–ఎయిడ్స్ పాజిటివ్ ఉన్న గర్భిణీ ప్రసవం అయిన తర్వాత ఆమె జన్మించిన శిశువుకు ఆరు వారాలకు ఒకసారి, ఆరు నెలలకు, 18నెలలకు నిర్ధారణ పరీక్షలు చేస్తాం. ఈ ఏడాది 40ప్రసవాలు చేయడం జరిగింది. అన్ని ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రిలో చేస్తున్నాం. గర్భిణీ అయిన ప్రతి మహిళకు మూడు నెలల గర్భం సమయంలోనే హెచ్ఐవీ–ఎయిడ్స్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. దీంట్లో పాజిటివ్ నిర్ధారణ అయితే వెంటనే చికిత్స మొదలు పెట్టడం వల్ల గర్భంలో ఉండే శిశువుకు వైరస్ రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఆరు నెలలు దాటిన గర్భిణీకి పాజిటివ్ ఉన్నట్లు తేలితే శిశువు సైతం వైరస్ సోకే ప్రమాదం ఉంది. ఆరు నెలలలోపు పరీక్షలు చేసుకుంటే సరైన చికిత్స అందిస్తే శిశువుకు పాజిటివ్ వచ్చే అవకాశం ఉండదు. జిల్లాలో గర్భిణీగా గుర్తించిన ప్రతి ఒక్కరికి పరీక్షలు చేపడుతున్నాం. బాధితులను క్రమం తప్పకుండా పర్యవేక్షించడంతో పాటు అవసరం అయిన మందులు అందిస్తున్నాం. ప్రతి పీహెచ్‌సీలో ఈ పరీక్షలు నిర్వహించడంతో పాటు జనరల్ ఆస్పత్రిలోని ఏఆర్టీ, బాదేపల్లిలో ఏఆర్టీ సెంటర్లు ఉన్నాయి.

– డా. శశికాంత్, ప్రోగ్రాం అధికారి

జనరల్ ఆస్పత్రిలో ప్రత్యేక చికిత్స

ఉమ్మడి జిల్లాలో హెచ్ఐవీ–ఎయిడ్స్ వ్యాధి సోకిన వారందరికి జిల్లా జనరల్ ఆస్పత్రిలో సీడీ4 కౌంటింగ్ పరీక్షలు నిర్వహించి. తర్వాత వాళ్లకు అవసరమైన చికిత్సతో పాటు కావాల్సిన మందులు ఇస్తారు. దీంతో పాటు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు ప్రత్యేక ల్యాబ్, ఫార్మసీ అందుబాటులో ఉంది. రోగులకు చికిత్స అందించడానికి ప్రత్యేక వార్డులు కూడా ఏర్పాటు చేయడం జరిగింది. ఇక్కడి ప్రతి రోజు 150నుంచి 200 మంది వచ్చి పరీక్షలు చేసుకోవడంతో పాటు కౌన్సెలింగ్ చేయించుకుంటారు. చికిత్స అనంతరం వాళ్లకు ఆరు నెలలకు ఒక్కసారి మందులు ఇవ్వడం జరుగుతుంది.